# తగినశాస్తి

పూర్వం ఒకఊళ్లో ఒక జమీందారుగారు ఉండేవారు. వాళ్ళ తాతతండ్రులు సంపాదించి పోయిన సంపద జమీందారుగారికి చాలాఉండేది. ఆయన సంపాదించింది ఏమీ లేకపోయినా పూర్వులు సంపాదించి పోయిన ఆస్తిని మట్టుకు చాలా దుబారాగా ఖర్చుచేసేవాడు. జమీందారుగారు ప్రతిరోజూ విందులు, వినోదాలు జరిపేవాడు. ఆవిందుకు వీరు వారని భేదంలేదు. ఇప్పుడుఅప్పుడుఅని వేళ లేదు. లేదన్నమాట అసలు లేనే లేదు. తెలిసినవాళ్ళూ, తెలీనివాళ్లు అందరూ వచ్చేవారు. ఒక్కమాటలో చెప్పాలంటే ఆ ఊళ్లోని ప్రతివాడూవచ్చి విందు లుఆరగించి పోతూ ఉండేవాడు.

ఆయన ఇల్లు ఒక మహా సత్రంగా ఉండేది. భాగ్యవంతులుసైతము ఇతనిని ఆశ్రయించి యుండి అతనికిరుణకు పాత్రులయ్యేవారు. బెల్లంచుట్టూ ఈగలు ముసురునట్లుగా కవులు, గాయకులు, చిత్రకారులు, స్తోత్రపాఠకులు- వీరు వారనిలేదు అందఱూ అతనిని ఆశ్రయించుకుని ఉండేవారు. ఏ కవి అయినా తను బాగుపడాలంటే, తన కావ్యంవ్యాప్తిలోకి రావాలంటే ఆ కావ్యాల్ని జమీందారుగారికి అంకితం చేస్తేచాలు. ఆయన ఒకపెద్ద ధనం సంచిఇస్తాడు. జమీందారుగారికి అంకితం చేయబడిందికాబట్టి అదిప్రసిద్ధి పొందుతుంది. చిత్రకారుడూ ఒకబొమ్మగీచి దానిని ఎవరుకొంటారా? అని విచారింపనక్కరలేదు. దానిని జమీందారుగారి దగ్గరకుతీసికెళ్ళి బాగుందా? అంటేచాలు. ఆచిత్రకారుని జన్మ ఫలించినట్లే. అతనికి ఎవరైనా ఒక బహుమతి ఇచ్చారంటే అతడు దానికి ఏభైరెట్లు విలువగల బహుమానాలను ప్రతిఫలంగా ఇచ్చేవాడు. అతనిచుట్టును రాత్రి,పగలు అనక అనేకులు దొంగమిత్రులు, మోసగాండ్రు, యాచకులు,దొంగ వ్యాపారస్తులు గుమిగూడి అతని

## లింగం సుధాకర్

పాదాలొత్తి, కల్లబొల్లి మాటలు చెప్పి అతనికరుణకు పాత్రులయ్యేవారు. అయితేపాపం జమీందారుగారు వాళ్ళనందరిని తనమేలుకోరేవారే ననుకొనేవాడు.

అయితే ఈ పనులన్నీ జమీందారుగారి ముసలి దివానుకు నచ్చేవి కావు. ఆయన జమీందారుగారిని అనేకసార్లు బ్రతిమిలాడాడు. హెచ్చరించాడు. "వీరంతా మీ సంపదను చూచి కూడిన స్వార్థపరులు. మీ సంపద ఎప్పుడు సన్నగిల్లుతుందో అప్పుడు వీరు మిమ్ములను విడనాడుతారు" అని. అయితే జమీందారుగారు దివానుమాటలను లెక్క చేయలేదు. జమీందారుగారి మూర్ఖతకు దివాను చాలా విచారించాడు. ఇట్లాకొన్ని దినాలయ్యేసరికి జమీందారుగారి బొక్కసం ఖాళీ అయింది. దానితో జమీందారుగారు ఊరకుండలేదు. తనభూములను అమ్ముతూవచ్చాడు. దివాను ఎంత వారించినా ఫలితంలేక పోయింది. "నేను ధనాన్ని నా స్నేహితులకష్టాలను తీర్చుకోటానికి యిస్తున్నానుగాని, వృథాగా ఖర్చు చేయటంలేదు" అని సమాధానం చెప్పేవాడు. కొన్ని దినాలకు భూములన్నీ అమ్మేశాడు. అయినప్పటికి జమీందారుగారు తన విందులు, వినోదాలు మానలేదు. అప్పుచేయడం మొదలుపెట్టాడు. "నాఅప్పు తీర్చడానికి నాస్నేహితులు సహాయంచేస్తారులే" అనే ధీమాతో విందులు, వినోదాలు మరింత ఉత్సాహంతో చేసేవాడు. ఇంతలోకే జమీందారుగారు దివాళాఎక్కారని క్రమక్రమంగా అందరికి తెలిసింది.

అప్పులవాళ్లు కాట్లకుక్కల్లాగా ఒక్కసారిగా అతనిపైకి వచ్చారు. జమీందారుగారు తన స్నేహితుల సహాయంతో వాళ్ళపీడ సులభంగా వదిలించుకోవచ్చు ననుకున్నాడు. ఎల్లవేళల అతనిచుట్టూ ఈగలవలె మూగి గొప్పధనవంతులుగా మారిన వారిని తనకు సహాయం చేయమని అర్థించాడు. ఏ ఒక్కడూ అతనికి సహాయం చేయకపోగా ఇంకా జమీందారు గారిని పలువిధములుగా దూషింపసాగారు.

ఎవ్వడు చూచినా అతన్ని 'ఇంద్రుడు, చంద్రుడు, దేవుడు' అని పొగడినవారే 'ఉత్త తెలివిమాలినవాడు. కన్నుమిన్ను కానకుండా డబ్బుపాడుచేసినాడు, అవివేకి' అని జమీందారుగార్ని పరిహాసం చేయ

# ★ తగిన శాస్తి ★

సాగారు. మఱికొందరు "జమీందారు అప్పులపాలై పోవునని నాకు తెలుసు. విందులకు పోయినప్పుడు అతనికి అనేక పర్యాయములు సలహాయిచ్చాను. అతని ఖర్మ. దానికి మనమేమి చేయగలము" అని సులభముగా తప్పించుకొన్నారు. మరికొందఱు కపటమిత్రులు ఇంట నుండియు లేరనిపించి తప్పించుకొనసాగారు. నిన్న మొన్నటిదాకా దారిన పోయేవాడు సహితము జమీందారుగారి యింట విందు ఆరగించని వాడు లేడు. జమీందారుగారిని పొగడనివాడు లేడు. అయితే ఇప్పుడు జమీందారుగారి ఇంటికి ఒక్కడూ రాడు. ఒక్క పొగడ్తా వినబడదు. జమీందారుగారు చూస్తే ఎక్కడ సహాయం అడుగుతాడోనని అతనికంటికి కనిపించకుండా తప్పించుకుని పారిపోయేవారు. దివాను మాటలను విననందుకు జమీందారుగారు చాలా చింతించాడు. పాపం ఆయన తనచుట్టూ మూగినవారి నందరిని నిజమైన మిత్రులే ననుకున్నాడు. దివాను కూడా జమీందారుగారి కష్టదశకు చాలవిచారించాడు. ఓదార్చాడు.


**కౌంట్ ఆఫ్ మాంట్ క్రిస్టో**

రెండు భాగములు

ఒక్కొక్క భాగం

**వెల రూ. 3-8-0**

పోస్టుఖర్చు ప్రత్యేకం.

**ఆంధ్ర గ్రంథమాల,**

మద్రాసు-1


ధూర్తులైన కపట స్నేహితులకు మంచి గుణపాఠం నేర్పాలనుకున్నాడు జమీందారుగారు.

ఉన్నట్లుండి తటాలున ఒకరోజున జమీందారుగారు ఒక గొప్ప విందును ఏర్పాటు చేశాడు. తన పాత మిత్రులందరికీ ఆహ్వానాలు పంపాడు విందుకు రమ్మని. అతని మిత్రులంతా చాలా ఆశ్చర్యపడ్డారు. 'దివాళా ఎక్కిన జమీందారు మళ్లా విందులు వినోదాలు ఎట్లా చేస్తున్నాడా?' అని.

"సరే దీని సంగతేమిటో చూద్దాం" అని అందరూ మామూలుగా విందుకు వచ్చారు. అంత గొప్ప విందును జమీందారు గారు ఇంతవరకూ చేయనేలేదు. విందు కొచ్చినవాళ్ళంతా అంత బ్రహ్మాండమైన విందును చూచి కలవరపడ్డారు. అందఱూ తెల్లముఖాలు వేశారు. ఆఖరికి వాళ్ళంతా విశ్వయించుకొన్న దేమంటే "జమీందారుగారు మన మనస్సులను పరీక్ష చేయడానికి దివాళా ఎక్కినట్లుగా నటించాడు. అయితే అసలు ఆయన దివాళా తీయలేదు" అని. వాళ్ళంతా తమ అజ్ఞానానికి చాల నిందించుకున్నారు. పప్పులో కాలేశామే అని విచారించారు. మరల జమీందారుగారి అనుగ్రహం సంపాదించుకోటానికి తమ క్షమాపణలను చెప్పుకొన్నారు. మీ అక్కరకు మేము తోడ్పడపోయినందులకు ఏమీ అనుకోవద్దని వేడుకున్నారు.

"మీరు దీన్నంతా మనస్సులో పెట్టుకోకూడదు. నేను మిమ్ములను పరీక్ష చేద్దామని తమాషా చేశాను. అంతేగాని మరేమీ లేదు. నేను దీన్నంతా ఎప్పుడో మరచిపోయాను" అని జమీందారుగారు చెప్పారు. ఇక ఆనాటినుంచి మరల ఎప్పటివలెనే విందులు, వినోదాలు జరగసాగాయి. అతని మిత్రులంతా మరల జమీందారుగారిని ఆశ్రయించారు. ఇట్లా కొన్ని దినాలుగడిచాయి. ఒకరోజున జమీందారుగారు తన దివానును పిలిచి "నా మిత్రులందరి దగ్గరికిపోయి, నేనడిగినట్లుగా చెప్పి, వారిచ్చినంత డబ్బును తీసుకు ర"మ్మని చెప్పాడు. దివాను సరేనంటూ వెళ్ళి జమీందారుగారి సందేశాన్ని అందరికీ చెప్పాడు. "మరల జమీందారుగారు మనల్ని పరీక్ష చేస్తున్నాడు. ముందు మాదిరిగా కాకుండా ఈసారి అతనిమీద మాకు విశ్వాసమున్నట్లుగా చూపెట్టాలి" అని అందరూ పోటీపడి తమ దగ్గర నున్న ధనాన్నంతా ఇచ్చారు. మఱికొందరు సమయానికి డబ్బు లేకపోతే తమ తమ భవనాలను, భూములను అమ్ముకొని, డబ్బు చేసి జమీందారుగారికి పంపారు. జమీందారుగారు ఆ డబ్బునంతా పుచ్చుకొని మొదట అప్పుల వాళ్ళ బాధ వదిలించుకున్నాడు. మిగతా డబ్బును తీసుకొని యింకో దూరప్రాంతానికి పోయి పూర్వంలా కాకుండా సుఖంగా బ్రతుకుతున్నాడు.

"మేము ఇన్ని దినాలు జమీందారుగారిని కొలిచినందులకు ప్రతిఫలమన్నా యివ్వకుండా తనిచ్చిన డబ్బంతా తిరిగి తీసుకుపోయాడే" అని అతని దొంగస్నేహితులు చాలా దుఃఖించారు. ఆ దుష్టులకీవిధంగా తగిన శాస్తి జరిగింది. ★